

తెచ్చుకున్నాడు. ఇప్పుడు మంత్రులమాట పాటిస్తూ రాజ్యాన్ని చక్కగా పాలిస్తున్నాడు'' అని సమాధాన మిచ్చాడు వర్తకుడు.

''చచ్చి బతకడం ఏమిటి? సరిగా వివరంగా చెప్పు'' అని అడిగాడు ఫణిదత్తుడు.

''రుక్మవర్మ రాజు కాగానే మీ తల్లిగారిపై అభియోగం తెచ్చిన కామందకుణ్ని విడుదల చేశాడు. తన నిజాయ తీని నిరూపించుకోమని అవకాశం ఇచ్చాడు. వాడు కాస్తా ధారానగరం వెళ్లి, దొంగ సాక్ష్యాలు సంపాదించు కుని వచ్చాడు. వాటి ఆధారంగా మీ అమ్మగారు కామం దకుని భార్యే అని తీర్పునిచ్చాడు రుక్మవర్మ. ఇంతలోనే అక్కడికి మరోవ్యక్తి వచ్చి, తానే పితృదత్త భర్తనని ధ్రువీకరిస్తూ భోజరాజిచ్చిన పత్రాన్ని చూపించాడు. కానీ రుక్మవర్మ తన తీర్పు మార్చలేనని చెప్పాడు. దాంతో పత్రాన్ని తీసుకొచ్చిన వ్యక్తి ఒక పాములా మారి రుక్మవర్మను, కామందకుణ్ని కాటేశాడు. మీ తల్లిగారిని తీసుకుని ఎటో వెళ్లిపోయాడు. కామందకుడు చచ్చిపోయాడు. కానీ రుక్మవర్మను వైద్యులు బతికించ గలిగారు. ఆనాటినుంచి అతని బుద్ధి కుదురుకుంది. ఇదీ జరిగిన కథ'' అని చెప్పాడు వర్తకుడు.

అంతా విన్న తరువాత ఫణిదత్తుడు నిట్టూర్చి..

''అయితే ఎట్టకేలకు మా తండ్రిగారు తిరిగివచ్చా రన్నమాట. సంతోషం. సుబాహూ! అమ్మలేని ఊరికి వెళ్లడం ఎందుకు?! వాళ్లెక్కడికి వెళ్లారని వెతకగలం? ముందు మనం ఉజ్జయినికి పోయి మిత్రులను కలుసు కుందాం'' అన్నాడు.

వాళ్లు ఉజ్జయిని దిశగా అరణ్యాల మధ్యనుంచి ప్రయాణం కొనసాగించారు. ఒకచోట వారికి ఒక నిస్స హాయురాలైన యువతి జుట్టు విరబోసుకుని దుఃఖిస్తూ కనిపించింది. మిత్రులిద్దరూ ఆమె వద్దకు వెళ్లి శోకకా రణం ఏమిటని అడిగారు. తాను, తన భర్త మాళవదేశం నుంచి ఈ మార్గంలో వెళ్తుండగా, పులి మీద పడిందని.. తన మగడు ఆ పులిని తరుముతూ వెళ్లాడని, వారం రోజులైనా తిరిగి రాలేదని.. చెప్పిందామె.

ఫణిదత్తుడు ఆమెను ఊరడించాడు. తమతో రమ్మని, ఉజ్జయిని చేరుస్తామని చెప్పాడు. ముగ్గురూ కలిసి పగలంతా ప్రయాణించారు. చీకటి పడేవేళకు వాళ్లకు ఓ కుగ్రామం కనిపించింది. ఆ ఊరిలో చాలా ఇళ్లున్నాయి. కానీ మనుషులెవ్వరూ లేరు. పశుపక్షి మృగాదులు కూడా లేవు. ఓ ఇంటిలోకి వెళ్లిచూడగా గృహోపకరణాలన్నీ మాసి దుమ్ముపట్టి ఉన్నాయి. ఒక వీధిలో మనుషుల అస్థిపంజరాలు రాసులుగా పోగుపడి ఉన్నాయి.

అక్కడ రాత్రంతా గడపడం క్షేమకరమో కాదో తెలియదు. కానీ, అప్పటికే చీకటి పడిపోవడంతో చేసేది లేక ఒక ఇంటి అరుగుమీద మిత్రులిద్దరూ నిద్రకు ఉప క్రమించారు. వారికి దూరంగా యువతి నిద్రించింది.

మధ్యరాత్రివేళకు ఫణిదత్తుడికి మెలకువ వచ్చిచూసే సరికి.. కరకరమని చప్పుడు వినిపించసాగింది. ఆ యువతి రాక్షసి రూపం దాల్చి, సుబాహుణ్ని నమిలి మింగేస్తున్నది. అతని అవయవాలను నోటిలోకి తోసివే సుకుంటూ నములుతున్నది.

ఆ దృశ్యాన్ని చూసిన ఫణిదత్తుడికి రౌద్రం కట్టలు తెంచుకుంది.

హనుమంతుడు లంకిణిమీద విజృంభించినట్లుగా ఫణిదత్తుడు చప్పుడు చేయకుండా వెళ్లి ఆ రాక్షసి బ్రహ్మ రంధ్రం పగిలేలా ఒక్క గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకు దాని ముక్కురంధ్రాల నుంచి రక్తం కారసాగింది.

అది కుయ్యోమని అరుస్తూ పైకి లేవబోయింది. ఫణి దత్తుడు దానికి ఆ అవకాశం లేకుండా మరో పిడికిలి పోటు పొడిచాడు. అది వికృతంగా అరుస్తూ నేలమీద వాలిపోయింది. అంతలో దాని శరీరంనుంచి ఒక దేవ కాంత బయటికి వచ్చింది.

''మహాత్మా! నేనొక దేవకాంతను. రుషి శాపానికి గురై ఈ రాక్షసిగా మారాను. నీ దయవల్ల నాకిప్పటికి శాప విమోచనం కలిగింది. నీకేదైనా కోరిక ఉంటే చెప్పు. తీర్చి నా స్థానానికి వెళ్తాను'' అని చెప్పిందామె.

''నువ్వు పొట్టన పెట్టుకున్న నా మిత్రుణ్ని తిరిగి బతి కించు!'' అన్నాడు ఫణిదత్తుడు.

ఆమె ప్రభావం వల్ల సుబాహుని అస్థిపంజరం తిరిగి ప్రాణం పోసుకుంది. అతను నిద్రనుంచి మేల్కొన్న ట్లుగా లేచి కూర్చున్నాడు.

''మిత్రమా! మనం ఇక్కడున్నామేమిటి? అక్కడ కదా పడుకున్నాం. మనతో వచ్చిన ఆ అమ్మాయేది?'' అని అడిగాడు.

''అదంతా దారిలో చెబుతాను. పదముందు. ఇక్క ణ్నుంచి వెళ్లిపోదాం'' అంటూ దారితీశాడు ఫణిదత్తుడు.

వేగంగా నడక సాగిస్తూ పదిరోజుల వ్యవధిలోనే వారు ఉజ్జయినికి చేరుకున్నారు. మిత్రులైన సుప్రహ స్తుడు, వజ్రకాయులను కలుసుకుని వారిని ఆనందింప చేశారు. కొంతకాలం మిత్రులందరూ హాయిగా కాలం గడిపారు. అక్కడ ఉన్న రోజుల్లో మిత్రుల ఇళ్లలో తాండ విస్తున్న దారిద్ర్యాన్ని చూసి, ఫణిదత్తుడు కలత చెందాడు. వారి కుటుంబాలకు ఏదో ఒకవిధంగా ఆర్థిక సహాయం చేయాలని తలచాడు. కానీ అందుకు మార్గ మేమీ స్ఫురించలేదు.

ఆ విషయంలో సుబాహుణ్ని సంప్రదిస్తే..

''మనం నలుగురం పాటలీపుత్రం పోదాం. రుక్మ వర్మ తల చితగ్గొట్టి, సొమ్ము లాక్కుందాం'' అన్నాడు.

''అవును. అతనికి తగిన బుద్ధి చెప్పాల్సిందే! పదండి పాటలీపుత్రానికి'' అన్నాడు ఫణిదత్తుడు.

నలుగురూ తిరిగి ప్రయాణం కట్టారు.

వారికి దారిమధ్యలో సురప్రస్థమనే నగరం తారస పడింది. భూరిశ్రవుడనే రాజు పాలించే నగరమది. ఫణి దత్తుడు ఆ నగరంలో కూలి అయినా చేసి, ధనం సంపాదించి మిత్రుల తల్లిదండ్రులకు పంపాలని.. కొన్ని దినాలు ఆ ఊరిలోనే ఉండిపోయాడు.

కానీ, ధన సంపాదనకు ఎటువంటి ఉపాయం తోచలేదు. చివరికి దొంగతనం చేసైనా సరే, ధనం సంపాదించాలని మిత్రులందరూ నిశ్చయం చేసుకు న్నారు. అయితే అలవాటు లేని దొంగతనం ఎలా చేయాలి? ఎక్కడ చేయాలనే మీమాంస వచ్చింది. చివరికి రాజుగారి ధనాగారానికే కన్నం వేయాలని నిర్ణయించుకున్నారు. వింతలు చూసే నెపంతో కోట లోకి వెళ్లి, ధనాగారం ఆనుపానులు తెలుసుకొచ్చారు.

ఆ నగరానికి ఉత్తరంగా క్రోసు దూరంలో చిన్న మెట్ట ఉంది. దానివద్దనున్న పల్లపునేల నుంచి సొరంగం తవ్వడం ప్రారంభించారు. వజ్రకాయుడు మట్టి తవ్వుతుండగా.. మిగిలినవారు సహకరించారు. నెలరోజుల వ్యవధిలో తవ్వకం పూర్తయింది.

చివరిరోజున వజ్రకాయుడు బయటికి వచ్చి..

''ఫణిదత్తా! సొరంగం పూర్తయింది. దీనికి చివర నున్న 'కుట్టిమ శిల'ను పైకి లేపితే నేరుగా ధనాగారంలో తేలతాం'' అన్నాడు.

మిత్రులందరూ సంతోషించారు. మరునాడు సొరంగం మొదట సుబాహుణ్ని, మధ్యలో సుప్రహ స్తుణ్ని, వజ్రకాయుణ్ని కాపలా ఉంచి ఫణిదత్తుడు ఒక్కడే చివరివరకూ వెళ్లాడు. శిలను తొలగించి.. పైకి వెళ్లాడు. అది భాండాగారం కాదు. ఒక సుందరమైన అంతఃపురం. లోపల పట్టుపగలులాగా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. బంగారుతీగలతో, అద్దాలతో కూర్చిన చిత్రపటాలు కుడ్యాలపై వేలాడగట్టి ఉన్నాయి. విశాలమైన ఆ గదిలో హంసతూలికా తల్పంలో ఒక చిన్నది శయనించి ఉన్నది.

'ఔరా! మా వజ్రకాయుడు పొరబాటు చేశాడు. ఈమె రాజపుత్రిక కాబోలు. ఈమె ఒంటిపై విలువైన ఆభరణాలు ఉన్నాయి. వీటిని దొంగిలించుకుని పోతే చాలా సొమ్ము వస్తుంది. కానీ అది చాలా ప్రమాదకరం కదా!' అనుకున్నాడు ఫణిదత్తుడు. అంతలోనే..

'అయ్యో! ఉత్తమకులంలో పుట్టిన నేను ఇటువంటి నికృష్టమైన చౌర్యవృత్తికి దిగానేమిటి? ఇంత తుచ్ఛమైన పనికోసం ఎంత ప్రయత్నం చేశాను! మావంటి వీరులు చేయదగిన పనేనా ఇది?! ఇంతకంటే యాచించడం మంచిది' అని తనలో తాను తర్కించుకున్నాడు.

వెంటనే తొలగించిన రాతిబండలను మళ్లీ మూసివేసి బిలమార్గం వెంట వెనక్కి పోయాడు. మిత్రులకు జరి గింది చెప్పాడు.

''ఆ గదిలోకి వెళ్లగానే నా మనసు నాకు ఎదురు తిరి గింది. మనం ఈ మార్గం విడిచిపెట్టి, మరోరకంగా ధనా ర్జన చేద్దాం'' అని చెప్పాడు.

మిత్రులందరూ సరేనని అంగీకరించి, బిలమార్గానికి ఒక పాషాణాన్ని అడ్డుపెట్టి, నగరంలోకి ప్రవేశించారు.

ఆ మరునాడు ఒక వీధిలో హాహాకారాలు చేస్తూ జనాలు మహాప్రవాహంలాగా పరుగెత్తుకు పోతుండటం మిత్రుల కంటపడింది. ఎవరో ఒకరిని ఆపి, ఏం జరిగిం దని ఆరాతీశారు.

''అయ్యా! మా రాజుగారికి ఒక్కతే కుమార్తె. ఆమె పాముకాటుకు గురైందట. వైద్యులు బతకదని చెబుతు న్నారు'' అని చెప్పాడతను. ■

**(వచ్చేవారం.. ప్రణయ కలాపం)**